teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

## ల్యాబ్ టెక్నీషియన్ అభ్యర్థులకు అలర్ట్

పాత నిబంధనలే అమలు.. కొత్తగా ఏ మార్పులూ లెవ్వు

నిబంధనల మార్పుపై ఎంహెచ్ఎస్ఆర్బీ బిగ్ క్లారిటీ



02

ములుగు | సంపుటి : 04 | సంచిక : 176 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 24 డిసెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.



# దక్షిణాది మద్యంలో రారాజు తెలంగాణ

## తలసరి వినియోగం, ఆదాయంలో నంబర్ వన్

గ్రామీణ ప్రాంతాల్లోనే రికార్డు స్థాయిలో బీర్ల విక్రయాలు

ఖర్చులోనూ తెలంగాణే టాప్

లిక్కర్ విక్రయాల ద్వారా ఏటా రూ. 36,000 కోట్ల ఆదాయం



2

దక్షిణ భారత దేశంలో మద్యం వినియోగం మరియు తద్వారా లభించే ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ మరియు ఎక్సైజ్ శాఖ వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం, ఇతర పొరుగు రాష్ట్రాల కంటే తెలంగాణలో ఆల్కహాల్ వాడకం అత్యధికంగా ఉన్నట్లు స్పష్టమైంది.

## చెక్ పవర్ రద్దుపై సీతక్క క్లారిటీ

తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

ఉప సర్పంచులకు మంత్రి భరోసా



హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దుపై కొనసాగుతున్న ప్రచారానికి పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క ముగింపు పలికారు. ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దు అంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం అన్నారు. ప్రభుత్వం అలాంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని సీతక్క స్పష్టం చేసారు. ఉప సర్పంచ్ ల అధికారాల విషయంలో

మిగతా 2 లో

## ప్రపంచంతో పోటీ పడేలా సింగరేణిని తీర్చిదిద్దుతాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన

137వ ఆవిర్భావ వేడుకల్లో కార్మికులకు శుభాకాంక్షలు



2



## న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు సర్కార్ గ్రీన్ సిగ్నల్

- అర్ధరాత్రి వరకు వైన్స్, బార్లకు అనుమతి
- పబ్బులు, ఈవెంట్‌లలో డాగ్ స్క్వాడ్స్‌తో తనిఖీలు
- నిమిషాల్లోనే ఫలితం.. నార్కోటిక్స్ బృందాలు
- డ్రగ్స్ వాడితే కఠిన చర్యలు

2

## కేసీఆర్ పవర్ చూసి ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది

వాస్తు భయంతో సీఎం మెట్లు ఎక్కడం లేదు

గేట్లు మార్చినా భయం పోలేదు

సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ధ్వజం

2





## యూరియా బుకింగ్ యాప్‌కు రైతు జైత్రయాత్ర

- రెండు రోజుల్లోనే 60 వేల బస్తాల విక్రయం
- ఐదు జిల్లాల పైలట్ ప్రాజెక్ట్ సక్సెస్
- త్వరలో తెలంగాణ అంతటా అమలు
- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

2



## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం



మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే

వారం రోజుల పాటు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్

సెక్షన్ 185 ప్రకారం రూ. 10 వేల జరిమానా, 6 నెలల జైలు శిక్ష

క్రిస్మస్, న్యూ ఇయర్ వేడుకలపై నిఘా

2

## బెట్టింగ్ యాప్స్ కేసులో ముగిసిన సీఐడీ విచారణ




రీతూ, మంచు లక్ష్మి, పలువురు సెలబ్రిటీల స్టేట్‌మెంట్ రికార్డ్

ఈ కేసులో సీఐడీ రిపోర్ట్‌పై సర్వత్రా ఉత్కంఠ



హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన బెట్టింగ్ యాప్స్ కేసులో సీఐడీ విచారణ మంగళవారంతో ముగిసింది. యాప్‌లను ప్రమోట్ చేసిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, నటులు, ప్రముఖులను విచారించింది. మంగళవారం బిగ్‌బాస్ కంటెస్టెంట్ రీతు చౌదరి, నటి మంచు

మిగతా 2 లో

## అధికారులు జవాబుదారీగా ఉండాల్సిందే

- పనితీరుపై నిరంతర నిఘా
- మూడు నెలలకోసారి కార్యదర్శుల ప్రగతిపై సమీక్ష
- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ప్రతి నెలా పనితీరును సమీక్షించనున్న చీఫ్ సెక్రటరీ



5




## సొంత గడ్డపై సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన

కొడంగల్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం

# దక్షిణాది మద్యంలో రారాజు తెలంగాణ




హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): దక్షిణ భారత దేశంలో మద్యం వినియోగం మరియు తద్వారా లభించే ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ మరియు ఎక్సైజ్ శాఖ వెల్లడించిన తాజా గణాంకాల ప్రకారం, ఇతర పొరుగు రాష్ట్రాల కంటే తెలంగాణలో ఆల్కహాల్ వాడకం అత్యధికంగా ఉన్నట్లు స్పష్టమైంది.

**గణాంకాల్లో తెలంగాణ జోరు:**

లిక్కర్ వినియోగంలో సగటు తలసరి లెక్కలను పరిశీలిస్తే, దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది.

తెలంగాణ: ఏడాదికి సగటున 4.44 లీటర్లు.
కర్ణాటక: 4.25 లీటర్లు.
తమిళనాడు: 3.38 లీటర్లు.
ఆంధ్రప్రదేశ్: 2.71 లీటర్లు.
కేరళ: 2.53 లీటర్లు.

**బీర్ల వినియోగంలో రికార్డు.. పల్లెల్లోనే జోరు:**

తెలంగాణలో పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే మద్యం వినియోగం అధికంగా ఉండటం గమనార్హం. గతంతో పోలిస్తే రాష్ట్రంలో బీర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. జీవనశైలి మార్పులు, పెరిగిన లభ్యత ఇందుకు ప్రధాన కారణాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఖర్చులోనూ నంబర్ వన్:**

మద్యం కోసం ప్రజలు వెచ్చిస్తున్న సొమ్ము విషయంలో కూడా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది.

తెలంగాణలో ఒక్కొక్కరు ఏడాదికి సగటున రూ. 11,351 మద్యాన్ని కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఖర్చు కేవలం రూ. 6,399 గా ఉంది.

ఆదాయం: ఈ భారీ అమ్మకాల ద్వారా తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ. 36,000 కోట్ల పైచిలుకు ఆదాయం సమకూరుతుందని అంచనా.

**నిపుణుల హెచ్చరిక:**

మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విధానాల్లో వచ్చిన మార్పుల కారణంగా అక్కడ వినియోగం గణనీయంగా తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే, తెలంగాణలో పెరుగుతున్న ఈ ధోరణి పట్ల ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న మద్యం వ్యసనం వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, సామాన్యుల ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు "సర్కార్ గ్రీన్ సిగ్నల్"



హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): న్యూఇయర్ వేడుకలకు ప్లాన్ చేసుకునే వారికి తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన అర్ధరాత్రి 12 గంటల వరకు వైన్స్ షాపులు ఓపెన్ చేసుకునేందుకు అనుమతి ఇచ్చారు. రాత్రి ఒంటిగంటల వరకు బార్స్ నడిపేందుకు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. న్యూఇయర్ ఈవెంట్‌లకు కూడా రాత్రి ఒంటి గంట వరకు అవకాశం ఇచ్చారు. అయితే ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా ఎక్సైజ్, నార్కోటిక్స్, పోలీసుల ఆధ్వర్యంలో అనుమానిత ప్రాంతాలు, పబ్బులు, బార్ అండ్ రెస్టారెంట్స్‌లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు హైదరాబాద్ పోలీసులు. డ్రగ్స్ టెస్టులు కూడా నిమిషాల్లో తెలిసిపోయేలా అత్యాధునిక పరికరాలు వినియోగిస్తున్నామని చెప్పారు. పబ్బుల్లో డ్రగ్స్ ఛాయలు, అనుమానితుల గుర్తింపు కోసం ప్రత్యేకంగా డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేస్తామని తెలిపారు. డ్రంకన్ అండ్ డ్రైవ్ తనిఖీల నేపథ్యంలో మద్యం సేవించి వాహనాలు నడపకుండా డ్రైవర్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొత్తంగా గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక చర్యలను చేపట్టారు. ప్రశాంత వాతావరణంలో న్యూఇయర్ వేడుకలను నిర్వహించుకోవాలని కోరుతున్నారు. నిబంధనలు అతిక్రమించితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# కేసీఆర్ పవర్ చూసి ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది


హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రాజకీయ కక్ష సాధింపు చర్యలపై మండిపడ్డారు. కేసీఆర్ ప్రెస్‌మీట్ తర్వాత రేవంత్ సర్కార్ పూర్తి డిఫెన్స్‌లో పడిందని విమర్శించారు. 25 ఏళ్ల నా రాజకీయ జీవితంలో ఒక ముఖ్యమంత్రి రాత్రి 9:30 గంటలకు చిట్-చాట్ పెట్టి వివరణ ఇచ్చుకోవడం ఎప్పుడూ చూడలేదు. అరడజను మంది మంత్రులు పోటీపడి ప్రెస్ మీట్లు పెట్టారంటే అదే కేసీఆర్ పవర్ అని అన్నారు. అందాల పోటీలు, ఫుట్‌బాల్ షోకులు, గ్లోబల్ సమ్మిట్‌లు పేదవాడికి అన్నం పెడతాయా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి సచివాలయం అంటేనే భయం పట్టుకుంది. వాస్తు భయంతో సెక్రటేరియట్ మెట్లు ఎక్కడం లేదని ఎద్దేవా చేశారు. గేట్లు, తలుపులు మార్చినా భయం పోక కేవలం కమాండ్ కంట్రోల్ రూమ్‌కే పరిమితం అయ్యారని అన్నారు.

స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4,000 మందికి పైగా బీఆర్ఎస్ మద్దతుదారులు సర్పంచ్‌లుగా గెలవడంతో రేవంత్ రెడ్డికి ఏం చేయాలో తోచడం లేదని విమర్శనాస్త్రాలు సంధించారు. అందుకే కో ఆపరేటివ్ ఎన్నికలు పెట్టకుండా, కాంగ్రెస్ కార్యకర్తలను నామినేషన్ల ద్వారా నియమించాలని చూస్తున్నారు. దమ్ముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఓయూకు ఒంటరిగా వస్తానని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి వేలాది మంది పోలీసుల పహారాలో వెళ్లారు. విద్యార్థి నాయకులను అరెస్టు చేయించి వెళ్లడం ఆయన పిరికితనానికి నిదర్శనని అన్నారు. సాగునీటిపై ప్రభుత్వం ఇచ్చే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ని స్వాగతిస్తున్నాం. కానీ వాస్తవాలు చెప్పడానికి బీఆర్ఎస్‌కు కూడా పీపీటీ ఇచ్చే అవకాశం ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం మాకు ఇస్తూ మా గొంతు నొక్కుతున్నారు మైకులు కట్ చేస్తున్నారని ఆవేదన చెందారు. అవకాశం ఇస్తే అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ సర్కార్ బండారాన్ని బయటపెడతామని అన్నారు. ఇది ప్రభుత్వం కాదు ఒక కన్సల్టెన్సీ కంపెనీ. బొంబాయి బ్రోకర్ల సలహాలతో నడుస్తోందని ఆరోపణలు చేశారు.

# ప్రపంచంతో పోటీ పడేలా సింగరేణిని తీర్చిదిద్దుతాం

ఖమ్మం, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రపంచంతో పోటీ పడేలా సింగరేణి సంస్థను తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు సింగరేణి కాలరీస్ కంపెనీ నూతన జి.ఎం. కార్యాలయ భవనాన్ని సింగరేణి సంస్థ సి.ఎం.డి. కృష్ణ భాస్కర్, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ 137వ సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు కార్మికుల మధ్య జరుపుకోవడం తనకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ నూతన జీఎం కార్యాలయం విశాలంగా నిర్మించుకొని నేడు ప్రారంభించామని అన్నారు. సింగరేణి సంస్థ నేడు 45 వేల శాశ్వత ఉద్యోగులు, 40 వేల కాంట్రాక్టు ఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించిందని అన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా చేస్తూ ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు సింగరేణి సంస్థ కృషి చేస్తున్నదని అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఉన్న విద్యుత్ కేంద్రాలు బొగ్గు వాడుకోవడం కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా మనం సరఫరా చేస్తున్నామని, విద్యుత్ ఉత్పత్తికే కాకుండా వ్యాపార అవసరాలకు కూడా మనం బొగ్గును సరఫరా చేస్తున్నామని అన్నారు. బొగ్గు ఉత్పత్తి కంపెనీలు గతంలో ప్రభుత్వ పరంగానే ఉండేవని, కాలక్రమేణ వచ్చిన మార్పులతో ప్రైవేట్ సంస్థలకు కూడా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. బొగ్గు మైన్స్ ఆక్షన్‌లో ప్రైవేటు సంస్థలు కూడా పాల్గొంటున్నాయని, విదేశాల నుంచి కూడా బొగ్గు దిగుమతి చేసుకునే అవకాశం ఉన్నందున పెరిగిన పోటీలో సింగరేణి కాలరీస్ కూడా తట్టుకొని నిలబడాలని అన్నారు. నాణ్యమైన బొగ్గును మార్కెట్ ధరకు సరఫరా చేయాలని, పోటీని తట్టుకునేలా సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి నాణ్యత పెంచుకోవాలని డిప్యూటీ సీఎం సూచించారు. సింగరేణి సంస్థకు మైనింగ్‌లో ఉన్న ప్రావీణ్యం మరెవరికి ఉండదని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బొగ్గు తవ్వకాల్లకే పరిమితం కాకుండా సింగరేణి సంస్థ మరిన్ని రంగాలలో రాణించాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచాలని ప్రభుత్వం పాలసీలు రూపొందిస్తున్నాయని అన్నారు. ప్రపంచీకరణలో వస్తున్న మార్పులను సింగరేణి కాలరీస్ సంస్థ అలవర్చుకోవాలని, రేర్ ఎర్త్ మినరల్స్, క్రిటికల్ మినరల్స్ మైనింగ్ వైపు దృష్టి సారించాలని అన్నారు. గ్లోబల్ స్థాయికి ఎదిగాలని, ప్రపంచ వ్యాప్తంగా సింగరేణి జెండా ఎగరాలని డిప్యూటీ సీఎం అన్నారు. సింగరేణి విస్తరణ ప్రపంచ వ్యాప్తంగా జరిగేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపించాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అన్నారు. సింగరేణి పరిధిలో ఉన్న బొగ్గు బ్లాకులపై కేంద్ర ప్రభుత్వం ఆక్షన్ విధిస్తే బయట ఎవరి చేతిలోకి పోకుండా కట్టుదిట్టమైన ప్రణాళిక అమలు చేస్తున్నామని అన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా సింగరేణి అడుగు పెట్టిందని, ప్రయోగాత్మకంగా ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో పంపుడ్ స్టోరేజ్ ప్లాంట్ కూడా నిర్మిస్తామని, రాజస్థాన్ ప్రభుత్వంతో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సింగరేణి ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగిందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే తన దృష్టికి తీసుకుని వచ్చిన సమస్యలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఖమ్మం జిల్లా ప్రజలకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు డిప్యూటీ సీఎం తెలిపారు.

# ల్యాబ్ టెక్నీషియన్ అభ్యర్థులకు అలర్ట్



హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి సంబంధించి నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని మెడికల్ %డ% హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్పష్టం చేసింది. ఈ అంశంపై ఒక ప్రముఖ పత్రికలో ప్రచురితమైన వార్త పూర్తిగా అవాస్తవమని బోర్డు తెలిపింది. ఉద్యోగాల భర్తీలో వెయిటేజీ మార్కుల అంశానికి సంబంధించి 2022లో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.59 ప్రకారమే అర్హులకు వెయిటేజీ మార్కులు కలుపుతున్నామని ఎంహెచ్ఎస్ఆర్బీ పేర్కొంది. కొత్తగా ఎలాంటి నిబంధనల మార్పులు చేయలేదని, 2022 నుంచి జీవో 59 ప్రకారమే నియామకాలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది. ఇప్పటివరకు 10,850 పోస్టులను పూర్తిగా పారదర్శకంగా భర్తీ చేశామని బోర్డు వెల్లడించింది. నియామక ప్రక్రియలో ప్రతి దశలోనూ అభ్యర్థులకు అభ్యంతరాలు తెలియజేసేందుకు తగిన గడువు ఇస్తున్నామని, వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని సమగ్రంగా పరిశీలించి స్పష్టత ఇచ్చిన అనంతరమే తదుపరి దశకు వెళ్తున్నామని వివరించింది. నియామకాల్లో పారదర్శకత, న్యాయసమ్మత విధానాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంహెచ్ఎస్ఆర్బీ కార్యదర్శి మంగళవారం ఒక రీజోయిండర్‌లో పేర్కొన్నారు.

# చెక్ పవర్ రద్దుపై సీతక్క క్లారిటీ


మొదటి పేజీ తరువాయి

జరుగుతున్నా అసత్య ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కోరారు. సోషల్ మీడియాలో లేదా ఇతర మీడియా వేదికల్లో ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్ణయానికి తావులేదని సీతక్క క్లారిటీ ఇచ్చారు. కాగా సీతక్క ప్రకటనపై ఉప సర్పంచులు ఊపిరి పీల్చుకున్నారు.

# యూరియా బుకింగ్ యాప్‌కు రైతు జైత్రయాత్ర

హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఐదు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న యూరియా బుకింగ్ యాప్ కు విశేష స్పందన వస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ లో మంత్రి పోస్ట్ చేశారు. రెండు రోజుల్లో యాప్ ద్వారా 60,510 యూరియా బస్తాల కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. 19,695 మంది రైతులు యాప్‌లో బుకింగ్ చేసుకున్నారని పేర్కొన్నారు. 217 మంది కౌలు రైతులు 678 బస్తాలు బుకింగ్ చేసుకున్నట్టు తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా యాప్ అమలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రారంభంలో వచ్చిన టక్నికల్ సమస్యలను గుర్తించి దానిని పరిష్కరించామని చెప్పారు. రబీ సీజన్ కోసం ఇప్పటికే రాష్ట్రానికి 5లక్షల 30వేల మెట్రిక్ టన్నుల యూరియా అందినట్టు తెలిపారు. జనవరి ఫిబ్రవరిలో యూరియా డిమాండ్ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో దానికి తగినట్టుగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఈ యాప్ ను మొదట పైలట్ ప్రాజెక్టుగా ఆదిలాబాద్, జనగామ, మహబూబ్నగర్,నల్గొండ, పెద్దపల్లి జిల్లాలో ప్రారంభించారు. అక్కడ మంచి ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా సేవలను విస్తరించనున్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం




హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ మహానగరంలో రోడ్డు భద్రతను మెరుగుపరచడమే కాకుండా, ప్రమాదాల వల్ల సంభవించే ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా ట్రాఫిక్ పోలీసులు సరికొత్త కార్యాచరణను ప్రకటించారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపి, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టే వాహనదారులపై ఉక్కుపాదం మోపాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ గారు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో, రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని, నగరం వ్యాప్తంగా 2025 డిసెంబర్ 24 నుండి డిసెంబర్ 30 వరకు వారం రోజుల పాటు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడాన్ని ఏమాత్రం సహించేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారి పట్ల పోలీసులు అత్యంత కఠినంగా వ్యవహరిస్తారని ఆయన స్పష్టం చేశారు. మోటార్ వాహనాల చట్టం-1988లోని సెక్షన్ 185 ప్రకారం మద్యం తాగి పట్టుబడే వారికి సుమారు పదివేల రూపాయల వరకు జరిమానా విధించడంతో పాటు, నేరం తీవ్రతను బట్టి గరిష్టంగా ఆరు నెలల జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, పునరావృత నేరస్తుల విషయంలో కఠినమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా పదే పదే మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే, వారి డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలల నుంచి శాశ్వతంగా రద్దు చేసే అధికారం పోలీసులకు ఉంటుందని పేర్కొన్నారు. ఒకవేళ మద్యం మత్తులో వాహనం నడుపుతూ ప్రమాదం చేసి ఎవరికైనా హాని కలిగిస్తే, అటువంటి వారిపై భారతీయ న్యాయ సంహితలోని అత్యంత కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

నగరంలో మైనర్లు వాహనాలు నడపడం పట్ల కూడా కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, ఒకవేళ మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే సదరు వాహన యజమానులు లేదా తల్లిదండ్రులను బాధ్యులుగా చేస్తూ వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ గారు గట్టిగా చెప్పారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని ఆయన కోరారు. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ప్రజలు తమకు తెలిసిన సమాచారాన్ని పోలీసులకు చేరవేయవచ్చని, ఇందుకోసం 8712661690 వాట్సాప్ నంబర్ లేదా 9010203626 ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన ఫేస్‌బుక్, ఎక్స్ ద్వారా కూడా ఫిర్యాదులను స్వీకరిస్తామని, ప్రజల సహకారంతోనే సురక్షితమైన హైదరాబాద్‌ను నిర్మించగలమని ఆయన ఆకాంక్షించారు.

# బెట్టింగ్ యాప్స్ కేసులో "ముగిసిన సీఐడీ విచారణ"

మొదటి పేజీ తరువాయి

లక్ష్మి, యూట్యూబర్ భయ్యా సన్నీ యాదవ్‌లను సీఐడీ అధికారులు విచారించారు. రెండు గంటలకు పైగా వీరిని ప్రశ్నించారు. స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. మరోవైపు ఇదే కేసులో ఇప్పటికే నటులు రానా దగ్గుబాటి, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, హీరోయిన్ నిధి అగర్వాల్, యాంకర్లు శ్రీముఖి, యాంకర్ విష్ణుప్రియ, నటి అమృత చౌదరి సీఐడీ అధికారుల విచారణకు గతంలో హాజరై వివరణ ఇచ్చారు. ఈ బెట్టింగ్ యాప్స ప్రమోషన్స్ కోసం జరిగిన లావాదేవీలపై గతంలోనే వీరిని అధికారులు ప్రశ్నించారు. ఈ విచారణలో బెట్టింగ్ యాప్స్‌కు ఎందుకు ప్రమోట్ చేశారు? అందుకు ఎంతెంత తీసుకున్నారు? యాప్ నిర్వాహకులతో చేసుకున్న ఒప్పందాలపై వీరి నుంచి అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. కాగా, ఈ కేసులో మొత్తం 25 మందిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

**ఎఫ్ఐఆర్ల ఆధారంగా కేసు నమోదు**

రాష్ట్రంలో బెట్టింగ్ యాప్‌లకు బానిసై చాలామంది యువత అప్పుల్లో కూరుకుపోయారు. ఫలితంగా ఆర్థికంగా నష్టపోయి, కొందరు బలవన్మరణానికి పాల్పడ్డారు. వీటిపై పలు పోలీస్ స్టేషన్లపై ఎఫ్ఐఆర్ నమోదయ్యాయయి. వీటిని ఆధారంగా చేసుకొని కేసు నమోదు చేసి 25 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను సీఐడీ విచారించింది. మంగళవారం రీతూ చౌదరి, భయ్యా సన్నీ యాదవ్ విచారణతో ఈ కేసు విచారణ ముగిసింది. ఇక బెట్టింగ్ యాప్ కేసులో సీఐడీ తుది రిపోర్టును తయారు చేయనుంది. ఇందులో ఏముండబోతున్నదనేది సస్పెన్స్‌గా మారింది.



# పదవ తరగతిలో 100శాతం ఫలితాలే లక్ష్యం

**గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాం నాయక్**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ మరియు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏటురూనాగారం ఆదేశానుసారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాం నాయక్ స్థానిక జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రయ పాఠశాల నందు ఆశ్రమ పాఠశాలల హెడ్మాస్టర్లు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు మరియు ఐ టి డి ఏ , ఏ ఈ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ దేశిరాం నాయక్ మాట్లాడుతూ ప్రతి ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతిలో 100 శాతం ఫలితాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దానికోసం 60 రోజుల నిర్దిష్ట ప్రణాళిక ఏర్పరచుకొని విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేయాలని ఆదేశించడం జరిగింది. ప్రతి పాఠశాలలో ఫుడ్ సేఫ్టీ కమిటీ యొక్క వివరాలు ప్రదర్శించబడిఉండాలి, మెనూ ప్రకారం హైజినిక్ ఫుడ్ ఖచ్చితంగా అందించాలని, రికార్డులు రిజిస్టర్ ప్రతిరోజు అప్డేట్ చేయాలనీ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లకు సూచించడం జరిగింది, ప్రతి ఆశ్రమ పాఠశాలలో మరియు సంక్షేమ వసతి గృహాల్లో రిపేర్ వర్క్ త్వరితగతిన పూర్తి చేయాలని ఐ టి డి ఏ , ఏ ఈ లను ఆదేశించడం జరిగింది. ప్రతి పాఠశాలలో జనరల్ శానిటైజేషన్ మరియు టాయిలెట్ల శానిటైజేషన్ ప్రతిరోజు జరిగేలా చూడాలని, హెడ్మాస్టర్లను మరియు వార్డులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, ఏటీడీయో కొత్తగూడ, ఉపేందర్ ఏ టి డి ఓ మహబూబాబాద్, ఏ సి ఎం ఓ డి.రాములు, డిప్యూటీ ఈఓ సారయ్య, జి సి డి ఓ విజయ డీ ఆర్ పి శ్రీకాంత్, ఏ ఈ లు ఎర్రయ్య, శోభన్, శ్రీను లు మరియు ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్లు మరియు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి: చల్లా ధర్మారెడ్డి



హనుమకొండ, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఇటీవలే జరిగిన సర్పంచి ఎన్నికల్లో గెలుపొందిన నడికుడ మండలం పులిగిల్ల, వరికోల్, నర్సక్కపల్లి గ్రామాలకు చెందిన సర్పంచులు, ఉప సర్పంచులు,వార్డు సభ్యులు మాజీ ఎమ్మెల్యేని హన్మకొండలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి పూల బొకే అందచేసి మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికలవరకే పార్టీలని,తర్వాత పాలకవర్గ సభ్యులందరూ కలిసికట్టుగా గ్రామాన్ని అభివృద్ధే లక్ష్యంగా కృషిచేయాలన్నారు.మీపై ప్రాల్లో ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచులు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ వెల్ఫేర్ స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





మహబూబాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ పట్టణం, రాజాల్ పేటలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వసతి గృహాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు, స్టోర్ గది, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు. తాజా కూరగాయలు, నిత్యవసర వస్తువులు నాణ్యత పక్కాగా పాటించాలని, భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ ఉండాలన్నారు. శీతకాల నేపథ్యంలో పిల్లలకు డైట్ మెనూ ప్రకారం వేడివేడి ఆహారాన్ని అందించాలని, రాత్రివేళలో పిల్లలకు చలి తీవ్రతను తట్టుకునే విధంగా ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించాలని, వేడి నీరు అందించాలని సూచించారు. వ్యక్తి గత పరిశుభ్రత పాటించడానికి పిల్లలకు అవగాహన కల్పించడం ద్వారా మానసిక, ఆరోగ్య సంరక్షణ ఉంటుందని, తద్వారా పిల్లలు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించడం జరుగుతుందని అన్నారు. నూతన టెక్నాలజీ వినియోగించి పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కృషి చేయాలని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు, స్టడీ అవర్లో ఉన్న పిల్లలతో స్వయంగా మాట్లాడి విద్య సామర్థ్యాలను పరిచీలించారు. ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు వారి పరిధిలో గల సంక్షేమ వసతి గృహాలను, పాఠశాలలను నిత్యం సందర్శించాలని సూచించారు. విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, ప్రత్యేక శ్రద్ధ వహించి నిత్యం తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట స్థానిక ప్రిన్సిపల్, సిబ్బంది ఉన్నారు.

# సమయానికి మేడారం పనులన్నీ పూర్తి చేస్తాం

**తాత్కాలిక పనులు కాకుండా శ్వాశత పనులను చేపట్టాం**

**రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



తాడ్వాయి, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మేడారం జాతర సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు రెండు వందల సంవత్సరాల కాలం పాటు చెక్కుచెదరకుండా ఉండేలా పనులు చేస్తున్నామని, అనుకున్న సమయానికి అన్ని పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మొక్కిన మొక్కులు తీర్చే తల్లులను దర్శించుకోవడానికి మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి లక్షలాదిమంది భక్తులు మేడారం చేరుకొని అమ్మవార్ల దీవెనలు పొందుతున్నారని తెలిపారు. మంగళవారం రాష్ట్రమంత్రి ధనసరి అనసూయ సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రా, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ తో కలిసి మేడారంలో శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయ అభివృద్ధి పనులను, సాండ్ స్టోన్ బొమ్మల లిపి చిత్రాలను, క్యూ లైన్ నిర్మాణ పనులను, గోవిందరాజు పగిడిద్దరాజుల గద్దెల నిర్మాణ పనులను, ఆలయ ఫ్లోరింగ్ పనులను, ఆలయ ప్రహరీలో వెదురు బొంగు మాదిరిగా ఉన్న స్తంభాలను,మేడారంలో చిలుకలగుట్ట రోడ్డు, స్తూపం, కన్నెపల్లి, జంపన్నవాగు, ఆర్.టి.సి. బస్ స్టేషన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మేడారంలోని హరిత హొటల్ లో సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులతో , గుత్తేదారులతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి కూలంకశంగా సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణ పనులు , రాత్రి నిర్మాణ పనులు, సివిల్ వర్క్స్ , గద్దెల చుట్టూ గ్రిల్స్, ప్రాకారం బయటి వైపు సీసీ రోడ్లను పనులు డిసెంబర్ 31వ తేదీ లోపు, ఇతర పనులు జనవరి 5వ తేదీ లోపు పూర్తి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను గుత్తేదారులను ఆదేశించారు. ప్రధాన ద్వారం పనులు కూడా జనవరి 5వ తేదీ లోపు పూర్తిచేయాలని అధికారులు చిత్తశుద్ధితో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.


ఆలయ ప్రాంగణం గద్దెల పరిసర ప్రాంతాలతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా త్వరితగతిన లైటింగ్ పనులను పూర్తి చేయాలని రహదారికి ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని , గద్దెలకు చేరుకునే హరిత వై జంక్షన్ నుంచి గద్దెల ప్రాంగణం వరకు సెంట్రల్ లైటింగ్ పనులను కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జాతర సమయంలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత ప్రతిపాదికన వాటర్ ట్యాంకులను నిర్మించాలని అధికారులు పనులను విభజన చేసుకొని సకాలంలో నిర్దేశించిన గడువులోపు పూర్తి ఆదేశించారు. జాతరకు వచ్చే అన్ని రహదారుల నిర్మాణం పూర్తి చేయాలని, ఐటిడిఏ ఆద్వర్యంలో తాత్కాలిక పనులకు ప్రాధాన్యత ఇవ్వకుండా, శాశ్వత అభివృద్ధి పనులకే ప్రాధాన్యతకి ఇవ్వాలని, సుందరీకరణ కూడలిలో గ్రాస్ ప్లాంటేషన్ పనులు, రహదారికి ఇరువైపులా రెవెన్యూ ప్లాంటేషన్ మొక్కలను నాటించాలని అన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులు వచ్చే జాతర కు సంబంధించిన కార్యక్రమాలు ప్రభుత్వం బ్రహ్మాండంగా నిర్వహిస్తుందని గతంలో కంటే కూడా 200 శాతం భక్తుల సంఖ్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది అన్నారు. అధికారులు పట్టుదలతో 31వ తేదీ లోపు పనులను పూర్తి చేయాలని, భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపధ్యంలో పోలీస్ శాఖ ఆర్ అండ్ బి అధికారులు సమన్వయంలో పని చేయాలని, వన దేవతల ఆశీసుల తో పనులు సాఫీగా సాగుతున్నాయని మంత్రి అనసూయ సీతక్క అన్నారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జాతరను విజయవంతం చేయాలని ఎంపీ బలరాం నాయక్ అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గిరిజన సాంప్రదాయాలు, సంస్కృతి ఉట్టిపడే విధంగా గద్దెల ప్రాంతంలో పాలరాతి శిల్పాలచే పునరుద్ధరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, తక్కువ సమయంలో 100 శాతం పని చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని వివరించారు. చిన్న చిన్న అవాంతరాలు కలుగుతున్నప్పటి వచ్చే సంవత్సరం జనవరి 5 వ తేదీ లోగా పనులు పూర్తి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న మేడారం మహా జాతరను పురస్కరించుకొని ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి, సహచర మంత్రులు, ప్రతిపక్ష నాయకులను ఆహ్వానిస్తున్నామని, అమ్మవార్ల దీవెనలు ప్రతి ఒక్కరిపై, దేశంపై ఉండాలని అన్నారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి వచ్చే భక్తులను దేవాలయ ప్రాంగణ పునరుద్ధరణ పనులు ఎంతగానో ఆకట్టుకోనున్నాయని, నిస్వార్థంగా దైవ కార్యక్రమాలను పూర్తి చేస్తున్నామని తెలిపారు. గద్దెల ప్రాంతాలలో విశాలమైన ప్రదేశాన్ని ఏర్పాటు చేయడంతో రోడ్డు విస్తరణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా 29 ఎకరాల భూసేకరణ చేపట్టి పనులు పూర్తి చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల అస్తిత్వాన్ని కాపాడుతూ పనులను చేపట్టామని, పాలరాతి శిల్పాలు ఇతర ప్రాంతాల నుండి తీసుకు రావడం కారణంగానే ఆలయ పునరుద్ధరణ పనులు కొంత ఆలస్యంగా జరుగుతున్నాయని తెలిపారు. పాలరాతి శిల్పాలపై గిరిజన సాంప్రదాయాలు ఉట్టిపడే విధంగా రూపొందిస్తున్నామని, అమ్మవార్ల దయతో సకాలంలో పనులు పూర్తి అవుతాయని అభిప్రాయపడ్డారు. రాబోయే తరాల వారికి అమ్మవార్ల చరిత్రలు తెలిసే విధంగా శిల్పాలను ఏర్పాటు చేస్తున్నామని, స్వస్తిక్ ఏర్పాటు విషయంలో గిరిజనుల సాంప్రదాయ ప్రకారంగా ఏర్పాటు చేస్తున్నామని దీనిపై ఎవరు రాద్ధాంతం చేయవద్దని కోరారు. పకృతి దైవాలుగా భావించి సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గొట్టు, గోత్రాల ప్రకారం పనులు చేస్తున్నామని, తామంతా ఒక టీంగా పనిచేస్తూ జాతరను విజయవంతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. మహా జాతరను పురస్కరించుకొని ప్రతి గడప గడప నుండి భక్తులు వచ్చి అమ్మవార్ల దీవెనలు పొందాలని కోరుతూ, జాతర విశిష్టతపై పాత్రికేయులు సైతం ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ మహా జాతరను పురస్కరించుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి కోట్లాది రూపాయలతో పనులు చేపట్టడం అర్శించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సి హెచ్ మహేందర్ జి, (స్థానిక సంస్థలు) సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ అండ్ బి, పి ఆర్ ఈ ఎన్ సి, ఆర్డీఓ వెంకటేష్, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్, ఉప సర్పంచ్

**గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది**

**ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం**

**ఎమ్మెల్యే శరేవూరి ప్రకాశ్ రెడ్డి**



గీసుగొండ, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): మంగళవారం గీసుగొండ మండలం నంద నాయక్ తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మరియు వార్డు మెంబర్లు, గ్రామ సర్పంచ్ (ఇండిపెండెంట్) భూక్య వీరేందర్ మరియు ఉప సర్పంచ్ భూక్య రాము పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పాత కొత్త అనే తేడా లేకుండా సమన్వయంతో గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు.పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా పరకాల డైరీ ని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన వార్డు మెంబర్లు వాంకుడోతూ మంజుల, వాంకుడోత్ రాజు, భూక్యరాజు, భూక్య సుజాత, బదావత్ బద్రు, బదావత్ సునీత, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బాదావత్ బాలోజీ, సుధాకర్ నాయక్, రమేష్, శ్రీను, బాబు తదితరులు కాంగ్రెస్ పార్టీలోకి చేరారు.

# మీ డబ్బు - మీ హక్కుకు మంచి స్పందన



వరంగల్ జిల్లా, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జాతీయ ప్రాంతీయ బ్యాంకులలో పదేళ్లకు పైబడిన అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లు వారి వారసులకు అప్పగించేందుకు జిల్లా లీడ్ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆధ్వర్యంలో మీ డబ్బు- మీ హక్కు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం ముత్యాల గణన్ సుప్రభాత్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ అధికారి గంట కమలాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు. తమ కుటుంబ సభ్యులకు సంబంధించి బ్యాంకు ఖాతాల్లో క్లెయిమ్ కానీ డిపాజిట్ లను నిబంధనల ప్రకారం కావాల్సిన ధ్రువపత్రాలు సమర్పించి తీసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాదారులు తప్పనిసరిగా కేవైసీ, ఈకేవైసీ చేయించు కోవాలన్నారు. ప్రస్తుతం డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని... కావున ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మీ డబ్బు - మీ హక్కు కార్యక్రమంలో భాగంగా మొత్తం సుమారు 50 మంది నామినీలకు, వారి కుటుంబ సభ్యులకు సంబంధించిన బ్యాంకుల అంగీకార పత్రాల మొత్తాన్నీ సమర్పించడం జరిగిందన్నారు. నిరంతరంగా జరిగే ఈ ప్రక్రియను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలి రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టి అండ్ బీ ఆర్ ఎంజీపి ఎస్ చైతన్య కుమార్ నాబార్డ్ డి.ఎం తంగ రవి, ఎస్ ఎల్ బి సి రిప్రజెంటెటివ్ పి. ప్రకాష్ పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ గడువులోపు పూర్తి చేయాలి

## లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరన పూర్తి చెయ్యాలి

## తాసిల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ, డేటా మ్యాపింగ్ పనులను నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం ఐడీఓసి కార్యాలయంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్‌తో కలిసి భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటీడీఏ పీవో రాహుల్, అన్ని మండలాల తహసీల్దార్లతో ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో ఉన్న డూప్లికేట్ ఎంట్రీలు, బ్లర్ ఫోటోలు, ఇతర లోపాలను గుర్తించి నిబంధనల ప్రకారం సరిదిద్దాలని సూచించారు. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సూపర్వైజర్లు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) సమన్వయంతో పని చేసి ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఎఈఆర్‌ఓలు తమ పరిధిలో పూర్తి బాధ్యత తీసుకుని, బీఎల్‌ఓలకు రోజువారీ లక్ష్యాలను నిర్ధేశించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన నిర్వహించి ఫోటోలు తీసి అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించి మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న హౌస్ నంబర్, పేరు, ఈపిక్ నంబర్ సెర్చ్ ఆప్షన్లు డేటా మ్యాపింగ్‌ను సులభతరం చేస్తున్నాయని తెలిపారు. అవసరమైన చోట్ల అదనపు సిబ్బంది, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రేపు అన్ని మండలాల్లో తహసీల్దారులు ఒకటి ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం, మరొకటి తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎంపిక చేసి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే జిల్లా స్థాయికి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మ్యాపింగ్ పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితా మ్యాపింగ్‌ను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని, అత్యంత జాగ్రత్తగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణను 15 రోజుల్లోపు పూర్తి చేయాలని కలెక్టర్ తహసీల్దారులను ఆదేశించారు. ఈ కెనాల్ కోసం అన్నపురెడ్డిపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, జూలూరుపాడు, కొత్తగూడెం, ములకలపల్లి, పాల్వంచ, సుజాతనగర్ మొత్తం 11 మండలాల్లో అవసరమైన భూసేకరణకు సంబంధించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వేయర్లు ప్రతిరోజూ ఏ మండలాల్లో ఎంతవరకు సర్వే పూర్తయిందో పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి చర్ల, దుమ్ముగూడెం, మణుగూరు మండలాల్లోని 30 గ్రామాల్లో భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీతారామ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ భూసేకరణ, సీతమ్మసాగర్ ప్రాజెక్టు భూసేకరణ పనులను భద్రాచలం సబ్ కలెక్టర్ పర్యవేక్షించాలని సూచించారు. తహసీల్దార్లు తమ పరిధిలోని పీపీసీ కేంద్రాలు, రైస్ మిల్లులను నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అశ్వారావుపేట చెక్‌పోస్ట్ వద్ద ఇసుక, ధాన్యం అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు మన ఇసుక – మన వాహనం' కార్యక్రమా న్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని తహసీల్దారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపర్డెంట్ ధారా ప్రసాద్, భూసేకరణ సిబ్బంది యాసీన్, ఎన్నికల శిక్షకుడు సాయికృష్ణ, ఎలక్షన్ సెల్ సిబ్బంది నవీన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యానికి అఖిలపక్ష ఆందోళన

## విద్యార్థులను మద్యపానానికి బానిసలు చేస్తే ఊరుకోం

## టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్





చిట్యాల, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండల కేంద్రంలో ఉన్న లక్ష్మీనరసింహ వైన్స్ కారణంగా జూనియర్ కాలేజీ విద్యార్థులు మద్యపానానికి బానిసలవుతున్నారని ఆరోపిస్తూ.. తెలంగాణ రాజ్యాధికార పార్టీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రవి పటేల్, వీకేసీ యూత్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రవి పటేల్, రాష్ట్ర నాయకులు వరంగల్ పార్లమెంట్ కాంటెస్ట్ ఎంపీ అభ్యర్థి ఎస్‌ఎఫ్‌కే సాగర్, టీఆర్పీ యూత్ జిల్లా అధ్యక్షులు బండి సునిల్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా విచ్ఛిన్నమైందని, నిబంధనల ప్రకారం విద్యాసంస్థలకు కనీసం ఒక కిలోమీటర్ దూరంలో ఉండాల్సిన వైన్ షాపులు మండల కేంద్రాల్లో, కాలేజీలకు అతి సమీపంలో కొనసాగడం వల్ల విద్యార్థులు మద్యపానానికి అలవాటుపడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థినీలు, మహిళలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైన్ షాప్ అనుమతుల విషయంలో ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, చిట్యాల మండల కేంద్రంలో ఉన్న వైన్ షాపులను ఊరికి దూరంగా తరలించడంతో పాటు సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షాల తరఫున డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం పోలీసులు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీధర్, విష్ణు, మహేష్ కుమార్, కిట్టు, సిద్ధు, చింటూ, మహేష్తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.



# ఆయిల్ పామ్ రైతు కు సన్మానం

మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా, మంగళవారం జిల్లా కలెక్టరేట్ లోని ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో అభ్యుదయ ఆయిల్ పామ్ రైతు, రాష్ట్ర స్థాయి పలు అవార్డుల గ్రహీత, ఎకరానికి అత్యధిక ఆయిల్ పామ్ గెలల దిగుబడి సాధించిన రూపిరెడ్డి గోపాల్ రెడ్డి ఆలేరు, నెల్లికుదురు మండలంని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఆర్.శ్రీనివాసరావు, కె.జ్యోస్నరాణి, కిశోర్, రామకృష్ణ, జి.కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు. జిల్లా రైతులు రూపిరెడ్డి గోపాల్ రెడ్డి వారిని ఆదర్శంగా తీసుకొని, వరి నుండి పంట మార్పిడి ద్వారా మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ సాగు చేయడానికి ముందుకు రావాలని విజప్తి చేసినారు.

# ఘనంగా మాజీ ప్రిన్సిపాల్ కె. సుభాష్‌చంద్ర రెడ్డి 21వ వర్ధంతి





హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుభాష్ చంద్ర రెడ్డి 21వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన కుమారుడు మనోజ్ రెడ్డి ఆధ్వర్యంలో సుభాష్ చంద్ర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుభాష్ చంద్ర రెడ్డి విద్యారంగానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా మనోజ్ రెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

**700 మంది విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం**

వర్ధంతిని పురస్కరించుకుని సుమారు 700 మంది విద్యార్థులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేవలం అన్నదానమే కాకుండా, ప్రతి ఏటా 50 మంది పేద విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను మనోజ్ రెడ్డి ఉచితంగా అందజేస్తూ వారి ఉన్నత చదువులకు చేయూతనిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంలో పలువురు ప్రముఖులు మరియు కుటుంబ సభ్యులు, రామారావు, లక్ష్మణరావు, శివగౌడ్, రాజశేఖర్, వినయ్, శ్రీనివాసరావు, సుధాకర్, చంద్రతేజ రెడ్డి, ప్రణవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా మనోజ్ రెడ్డి పేర్కొన్నారు.

# ఆర్థిక సంస్కరణల పితామహుడు పీవీకి ఘన నివాళులు

## టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు



హనుమకొండ, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): దేశానికి మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహా రావు అందించిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాస్ రావు అన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహా రావు వర్ధంతి సందర్భంగా హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, టీపీసీసీ మాజీ కార్యదర్శి బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహమ్మద్ అంకుస్, టి. సుమన్, సుగుణాకర్ రెడ్డి, బంక సంపత్, రహమతుల్లా, మానుపాటి శ్రీను, పి. రమేష్, కొండ నాగరాజు, మండల సమ్మయ్య, సరయ్య, రహీమున్నిసా తదితరులు పాల్గొని పీవీ నరసింహా రావుకి ఘన నివాళులు అర్పించారు.

# గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు




హన్మకొండ, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్):బీక్రిస్మస్ పండగను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను, డిటిఓ శ్రీనివాస్ కుమార్ పాల్గొని సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, మానవత్వం, ప్రేమ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ఈ పండుగ గుర్తుచేస్తుందని వారు పేర్కొన్నారు. క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ ఈజీఎస్ సెర్ప్, సూపరిండెంట్లు, డీపీఎంలు, ఏపీఎంలు తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అధికారులు జవాబుదారీగా ఉండాల్సిందే

హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం అన్ని విభాగాల ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో అన్ని శాఖల కార్యదర్శులకు కీలక సూచనలు చేశారు. గతంలో ఎనర్జీ, విద్య, ఇరిగేషన్, హెల్త్ వంటి ముఖ్య రంగాలకు స్పష్టమైన పాలసీలు లేకపోవడంతో అనేక సమస్యలు తలెత్తాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రెండేళ్లలోనే ప్రధాన విభాగాలకు అవసరమైన విధి విధానాలను రూపొందించినట్లు తెలిపారు. అధికారులు పూర్తి జవాబుదారీతనంతో పనిచేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ప్రతి నెలా కార్యదర్శుల పనితీరును చీఫ్ సెక్రటరీ సమీక్షిస్తారని తెలిపారు. అలాగే ప్రతి మూడు నెలలకోసారి తానే స్వయంగా అన్ని శాఖల కార్యదర్శుల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

# సొంత గడ్డపై సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

**కొడంగల్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం**

**సర్పంచులు, వార్డు సభ్యులతో సీఎం నేరుగా భేటీ**

**ప్రజాప్రతినిధులతో కలిసి లంచ్ చేయనున్న ముఖ్యమంత్రి**




హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌కి వెళ్లనున్నారు. సీఎం పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో ఇటీవల గెలుపొందిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో సీఎం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లతో సీఎం రేవంత్ రెడ్డి ముఖాముఖి చర్చ జరపనున్నారు. గ్రామాల అభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు అంశాలపై సీఎం చర్చించే అవకాశం ఉంది. అలాగే వారితో కలిసి భోజనం (లంచ్) చేయనుండటం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. కాగా, సీఎం పర్యటనకు సంబంధించి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. భద్రతా చర్యలతో పాటు కార్యక్రమ నిర్వహణపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది.

# గర్భిణీ, శిశువు ఆరోగ్యం పట్ల అధికారులు బాధ్యత యుతంగా ఉండాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగాం జిల్లా, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): ప్రతీ గర్భిణీ, శిశువు ఆరోగ్యం పట్ల మెడికల్ అధికారులు బాధ్యత యుతంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఐడీఓసీ లోని మినీ సమావేశ మందిరంలో శిశు మరణాల సమీక్ష మాతృ మరణాల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 2024%-25, 2025-%26 సంవత్సరాలకు సంబంధించిన శిశు, మాతృ మరణాల కేసులను సమగ్రంగా సమీక్షించి, భవిష్యత్తులో ఇలాంటి మరణాలు పునరావృతం కాకుండా అవసరమైన సరిదిద్దు చర్యలపై కలెక్టర్ మెడికల్ అధికారులతో సుధీర్ఘ చర్చించ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా మాతృ, శిశు ఆరోగ్య సేవలను బాధ్యత యుతంగా అమలు చేయాలని..ఆరోగ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా అధిక ప్రమాద గర్భిణీలను ముందుగానే గుర్తించడం, సంక్లిష్ట కేసులను సమయానికి రిఫర్ చేయడం, గర్భధారణ ముందు, సమయంలో, అనంతర సేవలను మరింత బలోపేతం చేయడం, అలాగే వంద శాతం సంస్థాగత ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఔషధాలు, పరికరాలు, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్ఎం ఆశా కార్యకర్తల పనితీరును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రిఫరల్ ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచాలని సూచించారు. నివారించగలిగే మాతృ, శిశు మరణాలను అడ్డుకోవడంలో సంబంధిత అధికారులు, సిబ్బంది బాధ్యతవహించాలని, అలాగే తీసుకున్న చర్యలపై క్రమం తప్పకుండా నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశాల్లో డా. కె. మల్లికార్జున రావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జనగామ జిల్లాతో పాటు సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# నటుడు శివాజీపై మహిళా కమిషన్ సీరియస్

**వివాదాస్పద వ్యాఖ్యలపై శివాజీకి నోటీసులు**

**సుమోటోగా కేసు నమోదు**

**డిసెంబర్ 27న విచారణకు హాజరు కావాలని ఆదేశం**

**వాఖ్యలకు బహిరంగ క్షమాపణ: శివాజీ**







హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): దండోరా సినిమా ఫంక్షన్‌లో నటుడు శివాజీ మహిళలపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. తాజాగా శివాజీ క్షమాపణ చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వీడియో విడుదల చేశారు. నాలుగు మంచి మాటలు చెప్పాలని అనుకున్నాను. ఈ క్రమంలోనే కొన్ని వాడకూడని పదాలు వాడాను. ఆ మాటలు కూడా అందరినీ ఉద్దేశించి మాట్లాడలేదు ముఖ్యంగా హీరోయిన్లను జాగ్రత్తగా ఉండాలని చెప్పాను. ఇటీవల ఒకరిద్దరు హీరోయిన్లు పబ్లిక్‌లోకి వచ్చినప్పుడు అభిమానులు వారిపట్ల మిస్ బిహేవ్ చేయడం, హీరోయిన్ల దుస్తులు కూడా చిరిగిపోయిన పరిస్థితులు మనం చూశాం. అందుకే అలా మాట్లాడాను ఏదేమైనా నా ప్రసంగంలో రెండు వాడకూడదని పదాలు వాడాను. దానికి క్షమాపణ చెబుతున్నాను. నేను మహిళలను అమ్మవారిలా చూస్తాను స్త్రీలను ఎవరూ తక్కువగా చూడొద్దు చూసే అవకాశం వారు కూడా ఇవ్వొద్దు అనే ఉద్దేశంతో అలా చెప్పాను. ఈ క్రమంలోనే రెండు వాడకూడని పదాలు వాడాను నా ఉద్దేశం మంచిదే కానీ సరైన పద్ధతిలో చెప్పలేకపోయాను. ఏదేమైనా నా మాటల వల్ల ఎవరైనా ఇబ్బందిపడి ఉంటే సారీ అని శివాజీ వీడియోలో చెప్పుకొచ్చారు. కాగా..

**నటుడు శివాజీకి మహిళా కమిషన్ నోటీసులు**

ధండోరా సినిమా ప్రమోషన్ ఈవెంట్‌లో మహిళల వస్త్రధారణపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ మహిళా కమిషన్ సీరియస్ అయింది. శివాజీ వ్యాఖ్యలు మహిళల గౌరవానికి భంగం కలిగించాయనే ఆరోపణలపై సుమోటోగా కేసును స్వీకరించి విచారణ ప్రారంభించింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఆ వ్యాఖ్యలలో మహిళల పట్ల అవమానకర ధోరణి ఉందని నిర్ధారించిన కమిషన్, తెలంగాణ మహిళా కమిషన్ చట్టం 1998 సెక్షన్ 16(1)(b) ప్రకారం శివాజీకి నోటీసులు జారీ చేసింది. డిసెంబర్ 27 ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని మహిళా కమిషన్ కార్యాలయంలో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని, సంబంధిత ఆధారాలు తీసుకురావాలని ఆదేశించింది.

# అతిగా ప్రవర్తించే అధికారుల "పేర్లు డైరీలో రాస్తున్నాం"

**రిటైర్ అయినా వదిలిపెట్టం**

**పోలీసులకు హరీశ్ రావు స్ట్రాంగ్ వార్నింగ్**



హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో హైదరాబాద్ సీపీ ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. త్వరలోనే మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్ రావుకు కూడా నోటీసులు ఇచ్చి విచారిస్తారనే వార్తలు మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. రాష్ట్రంలో 'సిట్'లు ఒక ప్రహసనం అయ్యాయని కామెంట్ చేశారు. ప్రభుత్వం డిఫెన్స్‌లో పడింది కాబట్టి తనకు నోటీసులు ఇస్తారట అంటూ ఎద్దేవా చేశారు.

**ఏ పోలీసు అధికారిని వదిలిపెట్టేది లేదు.**

అసెంబ్లీ సమావేశాలు ముగిసే 3వ తేదీ సాయంత్రం నోటీసులు ఇవ్వమని చెప్పారని తనకు సమాచారం ఉందని హరీశ్ రావు అన్నారు. కొందరు అధికారులు తమ పోస్టింగుల కోసం అక్రమ కేసులు పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏం జరిగిందో అందరూ చూశారని, రాజకీయ కక్షతో ఇబ్బంది పెడితే మీకు అదేగతి పడుతుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి మెప్పు కోసం అతిగా చేస్తే మూల్యం తప్పకుండా చెల్లించుకుంటారని అన్నారు. తమకు త్యాగాల చరిత్ర ఉందని అరెస్టుకు భయపడేది లేదన్నారు. అరెస్టు చేస్తే చేసుకోండి. రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తామని అన్నారు. అతిగా వ్యవహరిస్తున్న ప్రతి అధికారి పేర్లు బుక్‌లో నోట్ చేస్తున్నామని, అక్రమాలు, అరాచకాలు, సెటిల్‌మెంట్లు అన్ని రికార్డు అవుతూనే ఉన్నాయని వార్నింగ్ ఇచ్చారు. ఎక్కువ చేస్తున్న పోలీసు అధికారులను వదిలిపెట్టేది లేదని అన్నారు. చివరకు సర్వీసు నుంచి రిటైర్ అయినా విదేశాల్లో ఉన్నా, కేంద్ర సర్వీసులలో ఉన్నా తిరిగి రాష్ట్రానికి పట్టుకొస్తామని హరీశ్ రావు అన్నారు.

# రాష్ట్రంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పదోన్నతులు

**17 మందికి ప్రమోషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు**

**11 మంది ఐఏఎస్‌లకు అడిషనల్ సెక్రటరీ హోదా**

**ఆరుగురు ఐపీఎస్‌లకు డీఐజీ స్థాయి పదోన్నతులు**

**జనవరి నుండి బాధ్యతలు చేపట్టనున్న అధికారులు**

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్) పాలనా పరమైన వ్యవహారాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ చేరకు మొత్తం 11 మంది ఐఏఎస్‌లకు అడిషనల్ సెక్రటరీ హోదా మరియు 6 మంది ఐపీఎస్‌లను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ స్థాయికి ఎంపానెల్ చేస్తూ ప్రమోట్ చేసింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణ రావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో 2013 బ్యాచ్ ఐఏఎస్ లకు అడిషనల్ సెక్రటరీ హోదా కల్పించింది. పదోన్నతులు దక్కిన వారిలో శషాంక్, అద్వైత్ సింగ్, శృతి ఓజా, శ్రీజన, వినయ్, శివలింగయ్య, వాసం వెంకటేశ్వర్, హన్మంతరావు, హైమావతి, ఎం.హరిత, కె.హరిత ఉన్నారు.

ఐపీఎస్ లలో 2012 బ్యాచ్‌కు చెందిన ఎన్. శ్వేత, ఆర్. భాస్కరన్, జి. చందన దీప్తి, కల్మేశ్వర్ శింగెనవర్, ఎస్.ఎం. విజయ్ కుమార్, రోహిణి ప్రియదర్శిని ఉన్నారు. ఎన్. శ్వేత హైదరాబాద్ సిటీలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా, ఆర్. భాస్కరన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (సివిల్ ఇంటెలిజెన్స్)గా కొనసాగనున్నారు. ఇక జి. చందన దీప్తి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (రైల్వేస్, సికింద్రాబాద్)గా, విజయ్ కుమార్ కమిషనర్ ఆఫ్ పోలీస్, సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వర్తిస్తారు. అయితే, పదోన్నతులు పొందిన వారంతా సీఎస్ కే. రామకృష్ణ రావు ఆదేశాల మేరకు 2026 జనవరి 1 నుంచి చార్జ్ తీసుకోనున్నారు.



# 12 మంది పిల్లలు.. 5 పందులు

**అంగన్‌వాడీ దుస్థితిపై కేటీఆర్ షాకింగ్ ఫోటో**

**విద్యారంగంపై ఉదాసీనతకు వేముల ఘటనే నిదర్శనం**

**మొద్దు నిద్ర వీడండి అంటూ కేటీర్ విమర్శలు**



హైదరాబాద్, డిసెంబర్ 23 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో విద్యారంగంపై కొనసాగుతున్న నేరపూరిత నిర్లక్ష్యానికి అద్దం పట్టే చిత్రం ఇది అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ఫోటోను షేర్ చేశారు. ఈ మేరకు 12 మంది పిల్లలు. 5 పందులు అంటూ కేటీఆర్ మంగళవారం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఒక ఫోటోను నెటిజన్‌లతో పంచుకున్నారు. తెలంగాణలో విద్యారంగంపై కొనసాగుతున్న నేరపూరిత నిర్లక్ష్యానికి అద్దం పట్టే చిత్రం ఇదని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేములలో పూర్వప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అంగన్‌వాడీలో పందులు తిరుగాడుతుంటే, బిక్కుబిక్కుమంటూ భోజనం కోసం విద్యార్థులు లైన్లో నిలబడ్డారని పేర్కొన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కాక రెండేళ్లలో తెలంగాణ ప్రభుత్వ విద్యాసంస్థల్లో 102 ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు జరిగి 2188 పిల్లలు ఆస్పత్రుల పాలయ్యారని పేర్కొన్నారు. వివిధ కారణాల వల్ల 118 మంది ముక్కుపచ్చలారని పిల్లలు చనిపోయారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇంత దారుణమైన పరిస్థితులు ఉన్నా రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని ట్వీట్‌లో పేర్కొన్నారు.

# ఎయిర్‌పోర్టులపై అదానీ గ్రూప్.. గుత్తాధిపత్యం!



ఇటీవల ఎయిర్ ఇండిగో సంక్షోభం కారణంగా దేశంలోని లక్షలాది మంది విమాన ప్రయాణికులు ఎదుర్కొన్న ప్రయాణ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. దీనంతటికీ దేశీయ విమానయాన రంగంలో ఇండిగో సంస్థకు ఉన్న గుత్తాధిపపత్యమే కారణమని, ఆ సంస్థ తప్పు చేసిందని తెలిసినా ప్రభుత్వం తక్షణం ఏ చర్యలూ తీసుకోలేని నిస్సహాయ స్థితిలో పడిందని అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు మేధావులు, నిపుణులు కూడా నిర్ధారణకు వచ్చారు. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్వహణలో గుత్తాధిపత్యం సాధించి అతిపెద్ద ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌గా అవతరించిన అదానీ గ్రూప్‌పై ఇప్పుడు అందరూ దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే పలు విమానాశ్రయాలను చేజిక్కించుకున్న అదానీ గ్రూప్ గుత్తాధిపత్యాన్ని పలువురు వేలెత్తి చూపుతున్నారు.

వైమానిక రంగంలో మరో పెను సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. విమానాశ్రయాల నిర్వహణలో ఎలాంటి అనుభవం లేని అదానీ గ్రూప్.. మోదీ పాలనలో దేశంలోనే రెండో అతిపెద్ద ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్‌గా అవతరించింది. రెండేండ్ల స్వల్ప వ్యవధిలోనే ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 8 ఎయిర్‌పోర్టులను చేజిక్కించుకొంది. అంతటితో ఆగకుండా ఇప్పుడు మరో 12 విమానాశ్రయాలను కూడా తమ ఖాతాలో వేసుకొని, దేశంలోనే నంబర్ వన్ ఎయిర్‌పోర్ట్ ఆపరేటర్‌గా మారేందుకు అడుగులు వేస్తున్నది. అదానీ గ్రూప్ కోసం ఇప్పటికే వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను కారుచౌకగా కట్టబెట్టిన కేంద్రంలోని బీజేపీ సర్కారు.. మరో డజను ఎయిర్‌పోర్టులను కూడా కట్టబెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### వచ్చే ఐదేండ్లలో 12 ఎయిర్‌పోర్టులు లీజుకు

రానున్న ఐదేండ్లలో దేశంలోని 12 ఎయిర్‌పోర్టులను లీజుకు తీసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు అదానీ గ్రూప్ డైరెక్టర్ జీత్ అదానీ తెలిపారు. ఈ మేరకు రూ. లక్ష కోట్లను కేటాయించబోతున్నట్టు పేర్కొన్నారు. కాగా, దేశంలో రద్దీగా ఉండే ఎనిమిది ఎయిర్‌పోర్టులను కేంద్రంలోని బీజేపీ సర్కారు ఇదివరకే అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టింది. ఎయిర్‌పోర్ట్ నిర్వహణలో ఎలాంటి అనుభవంలేని కంపెనీలకు డీల్ అప్పగించవద్దంటూ ఆర్థిక వ్యవహారాల శాఖ (డీఈఏ), నీతి ఆయోగ్ చేసిన సూచనలను కూడా పక్కనబెట్టిమరీ ఈ ప్రక్రియకు ఆమోదముద్ర వేసింది. దీనికోసం నిబంధనలు కూడా మార్చేసింది.



ఈ డీల్‌లో అవకతవకలు జరిగాయంటూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఏఈయూ), ఆయా విమానాశ్రయాల్లో పనిచేస్తున్న వేలాదిమంది ఉద్యోగులు నిరసనోద్యమాలు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు. వెరసి గత 8 ఎయిర్‌పోర్టులకు అదనంగా ఇప్పుడు ఇంకో 12 ఎయిర్‌పోర్టులు కూడా అదానీ కంపెనీపరమైతే గుత్తాధిపత్యం తప్పదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విమానాశ్రయాల్లో చార్జీల మోత మోగవచ్చని చెప్తున్నారు. ఇండిగో తరహా సంక్షోభాలు నిత్యకృత్యంగా మారే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు.

### 'జీవీకే'ను దక్కించుకునేందుకు అడ్డదారులు

ఎయిర్‌పోర్టులను చేజిక్కించుకొనేందుకు ఇతర సంస్థలపై అదానీ గ్రూప్ ఒత్తిళ్లకు కూడా పాల్పడుతుందని విమర్శలు ఉన్నాయి. జీవీకే గ్రూప్ నిర్వహణలో ఉన్న ముంబై ఎయిర్‌పోర్ట్‌ను కైవసం చేసుకోవడంలో అదానీ కంపెనీ అడ్డదారులు తొక్కినట్టు ఆరోపణలున్నాయి. ఈ విషయంలో అదానీ కంపెనీకి కేంద్రం కూడా వంత పాడినట్టు విమర్శలు ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ముంబై ఎయిర్‌పోర్టులో జీవీకేకు 50.5 శాతం, దక్షిణాఫ్రికాకు చెందిన బిడ్‌వెస్ట్‌హడ్ కంపెనీకి 13.5 శాతం వాటా ఉండేది. ఒకవేళ బిడ్‌వెస్ట్‌హడ్ తన వాటాలను విక్రయించాలనుకొంటే తొలుత జీవీకేకు ఆ ఆఫర్‌ను ఇవ్వాలి. ఈ మేరకు ఆర్‌వోఎఫ్‌ఆర్ (రైట్ ఆఫ్ ఫస్ట్ రిఫ్యూజల్) క్లాజ్‌ను నిబంధనల్లో చేర్చారు. అయితే, అదానీ గ్రూప్ ఈ నిబంధనను తుంగలో తొక్కి, 2019లో బిడ్‌వెస్ట్‌హడ్ వాటాను చేజిక్కించుకొన్నది. దీంతో జీవీకే గ్రూప్ కోర్టులో కేసు వేసింది. ఈ క్రమంలోనే అనూహ్య పరిణామం చోటుచేసుకొన్నది.

ముంబై ఎయిర్‌పోర్ట్ అభివృద్ధిలో రూ.705 కోట్ల అవకతవకలకు పాల్పడినట్టు 2020 జూన్‌లో సీబీఐ.. జీవీకే గ్రూప్‌పై కేసు నమోదు చేసింది. అయితే, ఎప్పుడైతే ఈ ఎయిర్‌పోర్ట్ నిర్వహణలో ఉన్న తన 50.5 శాతం వాటాను అదానీ గ్రూప్‌నకు జీవీకే గ్రూప్ అప్పగించిందో.. సీబీఐ యూ-టర్న్ తీసుకొన్నది. ఈ కేసులో ఎలాంటి అవకతవకలు గుర్తించలేదంటూ కోర్టుకు తెలిపింది. జీవీకే గ్రూప్‌నకు ఒకవిధంగా క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ ఉదంతం వెనుక కేంద్ర ప్రభుత్వం ప్రమేయం ఉన్నదని, అదానీ గ్రూప్‌నకు ముంబై ఎయిర్‌పోర్టును అప్పగించడానికే జీవీకే గ్రూప్‌పై వేధింపుల పర్వం కొనసాగించిందంటూ విపక్షాలు ధ్వజమెత్తాయి. ఇప్పుడు ఈ 12 ఎయిర్‌పోర్టుల విషయం లోనూ ఇదే తరహా ఒత్తిళ్లు, వేధింపులు కొనసాగుతాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## నెమ్మదించిన కీలక రంగాలు.. నవంబర్‌లో 1.8 శాతంగా నమోదు

కీలక రంగాలు మళ్లీ నెమ్మదించాయి. క్రూడాయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, విద్యుత్ రంగాల్లో నెలకొన్న నిస్తేజం కారణంగా గత నెలకుగాను కీలక రంగాల్లో వృద్ధి 1.8 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.8 శాతం వృద్ధితో పోలిస్తే భారీగా పడిపోయినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టంచేశాయి. కానీ, అక్టోబర్ నెలలో నమోదైన వృద్ధితో పోలిస్తే మాత్రం మెరుగైన వృద్ధిని కనబరిచాయి. ఈ ఏడాది అక్టోబర్ నెలలో మైనస్ 0.1 శాతానికి పడిపోయాయి. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్యకాలంలో కీలక రంగాల్లో వృద్ధి సగానికి సగం 2.4 శాతానికి పడిపోయాయి. అంతక్రితం ఏడాది ఇది 4.4 శాతంగా నమోదైంది.

## భారత్ బయోటెక్‌తో బయోఫ్యాబ్రీ జట్టు

BHARAT BIOTECH

భారత్ బయోటెక్‌తో వ్యాక్సిన్ తయారీదారు బయోఫ్యాబ్రీ జట్టు కట్టింది. టీబీ ఔషధం కోసం సాంకేతిక బదిలీ ఒప్పందం చేసుకున్నది. ఇక ఈ ఒడంబడికతో ఆఫ్రికా, ఆగ్నేయాసియాలోని 70కిపైగా దేశాల్లో ఎంటీబీవీఏసీ ఉత్పత్తి, సరఫరాకు భారత్ బయోటెక్ బాధ్యత వహిస్తుంది. 'మా ఈ భాగస్వామ్యం అవసరమున్నవారికి ఈ వ్యాక్సిన్‌ను మరింత చేరువ చేస్తుంది' అని బయోఫ్యాబ్రీ ఆశాభావం వ్యక్తం చేసింది. ట్యూబర్క్యులోసిస్, దాని ప్రభావాలను అరికట్టడానికి కృషి చేస్తున్నామని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా అన్నారు.

## ఆదాయపు పన్ను శాఖ మీ సోషల్ మీడియా, ఈమెయిల్స్ చెక్ చేస్తుందా?




ఆదాయపు పన్ను శాఖ మన సోషల్ మీడియా, ఈమెయిల్స్‌ను చెక్ చేస్తుందా?.. ఏప్రిల్ 1, 2026 నుంచి మన సోషల్ మీడియా హ్యాండిల్స్, ఈమెయిల్స్‌ను యాక్సెస్ చేయగలదా? అనే అనుమానాలు ఇప్పుడు చాలా మందికి కలుగుతున్నాయి. దీనికి కారణం ఇలాంటి ప్రకటనలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటమే.

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సదరు పోస్ట్ ప్రకారం, ఏప్రిల్ 1, 2026 నుంచి పన్ను ఎగవేతను అరికట్టడానికి ప్రజల ఈమెయిల్స్, సోషల్ మీడియా ఖాతాలు, ఇతర డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను యాక్సెస్ చేసే అధికారం ఆదాయపు పన్ను (ఐటీ) శాఖకు లభిస్తుందని పేర్కొంది.

ఈ వార్త చాలా మంది పన్ను చెల్లింపుదారుల్లో ఆందోళన కలిగించింది. అయితే, ఈ క్లెయిమ్ తప్పుడు, మిస్‌లీడింగ్ అని ప్రెస్ ఇనార్మేషన్ బ్యూరో (%ూ×దీ%) ఫ్యాక్ట్ చెక్ స్పష్టం చేసింది. కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025లోని సెక్షన్ 247 ప్రకారం, ఐటీ శాఖకు డిజిటల్ స్పేస్‌లను యాక్సెస్ చేసే అధికారం కేవలం సెర్చ్ ఇంకా సర్వే ఆపరేషన్స్ సమయంలో మాత్రమే ఉంటుంది.

అంటే, పెద్దఎత్తున పన్ను ఎగవేత ఆధారాలు ఉన్న సీరియస్ కేసుల్లో మాత్రమే ఇది వర్తిస్తుంది. సాధారణ పన్ను చెల్లింపుదారుల రోజువారీ డేటాను లేదా ప్రైవసీని దీని ద్వారా ఉల్లంఘించరు. ఈ అధికారాలు 1961 చట్టం నుంచే ఉన్నవి, కొత్తగా ఏమీ జోడించలేదు. మాస్ సర్వైలెన్స్ లేదా అందరి ఖాతాలను చెక్ చేయడం జరగదు.

## జనవరి 1 నుంచే ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంపు.. !

వచ్చే ఏడాది నుంచి వివిధ కార్ల ధరలు పెంచుతున్నట్లు ఆయా కంపెనీలు ప్రకటనలు చేస్తున్నాయి. ఇతర టూ-వీలర్ ఎలక్ట్రిక్ స్కూటర్లు, వాహనాల తయారీ కంపెనీలు ధరల పెంపును ప్రకటించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ప్రముఖ ఎలక్ట్రిక్ టూ-వీలర్ తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ తమ కస్టమర్లకు షాకిచ్చింది. తమ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ల ధరలు పెంచుతన్నట్లు ప్రకటన చేసింది.

కొత్త ఏడాది అంటే జనవరి 1, 2026 నుంచే పెంచిన ధరలు అమలులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించింది. అన్ని మోడళ్లపై గరిష‘ంగా రూ.3 వేల వరకు పెంపు ఉంటుందని వెల్లడించింది. ముడి సరకు ధరలు పెరగడం, అంతర్జాతీయంగా కీలక ఎలక్ట్రానిక్ ఉపకరణాల ధరలు పెరగడం, ఫారెక్స్ ప్రభావం కారణంగా ధరల పెంపు నిరయం తీసుకోవాల్సి వచ్చినట్లు ఏథర్ ఎనర్జీ కంపెనీ వెల్లడించింది. ధరల పెంపు ఒక్కో మోడల్‌పై ఒక్కోలా ఉంటుందని కంపెనీ తెలిపింది.



అదే సమయంలో డిసెంబర్ స్కీమ్ ద్వారా ఎంపిక చేసిన పట్టణాలు, నగరాల్లో ఏథర్ స్కూటర్ కొనుగోళ్లపై రూ.20 వేల వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఏథర్ కంపెనీ 450 సిరీస్‌లో పెరార్మేన్స్ స్కూటర్లు, రిజ్తా పేరిట్ ఫ్యామిలీ స్కూటర్లు మార్కెట్లో ఉన్నాయి. ఆయా స్కూటర్ల ధరలు రూ. 1,14,546 నుంచి ప్రారంభమవుతున్నాయి. గరిష‘ంగా ఈ స్కూటర్ల ధరలు రూ. 1,82,946 వరకు ఉన్నాయి.




# విజయ్ హజారే ట్రోఫీలో కోహ్లీ, రోహిత్..

ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీకి రంగం సిద్ధమైంది. బుధవారం నుంచి ఈ టోర్నీకి తెరలేవనుంది. 15 ఏళ్ల సుదీర్ఘ సమయం తర్వాత భారత క్రికెట్ దిగ్గజాలు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఈ టోర్నీ బరిలోకి దిగుతున్నారు. న్యూఢిల్లీ తరఫున విరాట్ కోహ్లీ, ముంబై తరఫున రోహిత్ ఆడనున్నారు. ఇప్పటికే ఈ ఇద్దరు ఆటగాళ్లు ఆయా జట్లతో కలిసి సన్నాహకాలు మొదలుపెట్టారు. ఈ ఇద్దరూ తమ జట్ల తరఫున తొలి రెండు మ్యాచ్‌లు ఆడనున్నారు. కోహ్లీ, రోహిత్ శర్మతో పాటు రిషభ్ పంత్ (ఢిల్లీ కెప్టెన్), శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, అర్షదీప్ సింగ్ (పంజాబ్), మహమ్మద్ షమీ (బెంగాల్), హార్దిక్ పాండ్యా (బరోడా) వంటి స్టార్ ఆటగాళ్లు కూడా తమ రాష్ట్ర జట్ల తరఫున బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని సమయంలో సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్ ఆడాలని బీసీసీఐ తెచ్చిన కొత్త నిబంధన కారణంగా భారత ఆటగాళ్లు బరిలోకి దిగుతున్నారు. దాంతో ఈ టోర్నీకి క్రేజ్ నెలకొంది. డిసెంబర్ 24 నుంచి జనవరి 18 వరకు ఈ టోర్నీ జరగనుంది. జనవరి 12 నుంచి నాకౌట్ మ్యాచ్‌లు జరగనుండగా.. జనవరి 18న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తం 38 జట్లు బరిలోకి దిగుతున్నాయి.బెంగళూరు వేదికగా ఆంధ్ర జట్టుతో ఢిల్లీ తొలి మ్యాచ్ ఆడనుంది. ఆంధ్ర జట్టుకు ఆల్‌రౌండర్‌గా నితీష్ కుమార్ రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. అయితే ఈ మ్యాచ్‌కు ప్రేక్షకుల అనుమతి లేదు. ఐపీఎల్ 2025 సీజన్ విజయానంతరం చిన్నస్వామి స్టేడియం బయట జరిగిన తొక్కిసలాట నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కనీసం 2000 నుంచి 3000 మంది అభిమానులను అయినా లోపలికి అనుమతించాలని కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ కోరగా.. రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. క్రిస్మస్ సెలవుల నేపథ్యంలో అభిమానులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో భద్రతా కారణాల రీత్యా అనుమతి నిరాకరించారు. ఈ మ్యాచ్ వేదికను కూడా చిన్నస్వామి నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు తరలించారు.విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లు స్టార్ స్పోర్ట్స్‌తో పాటు జియో హాట్ స్టార్ వేదికగా ప్రసారం కానున్నాయి. లీగ్ దశలో అన్ని మ్యాచ్‌లకు ప్రత్యక్ష ప్రసారం లేదు. కేవలం అహ్మదాబాద్, రాజ్‌కోట్ వేదికగా జరిగే మ్యాచ్‌లు మాత్రమే ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి. దాంతో కోహ్లీ, రోహిత్ మ్యాచ్‌లను చూసే అవకాశం అభిమానులకు లేకుండా పోయింది. 38 జట్లు ఉండటం.. ఒకే రోజు 19 మ్యాచ్‌లు ఒకే సమయంలో ప్రారంభం కానుండటంతో బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నాకౌట్ మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కానున్నాయి.

# ఫిబ్రవరి 13 నుంచి టాలీవుడ్ ప్రో లీగ్




తెలుగు సినీ, క్రీడాభిమానులకు ఇదో డబుల్ బొనాంజా న్యూస్. ఒకేసారి ఇటు సినీ అభిమానులను అటు క్రికెట్ ఫ్యాన్స్‌ను అలరించే టీపీఎల్ టాలీవుడ్ ప్రో లీగ్‌కు సర్వం సిద్ధమైంది. ప్రముఖులు పాల్గొనే ఈ టోర్నీ ఫిబ్రవరి 13 నుంచి హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనుంది. మాదాపూర్ హెచ్ఐసీసీలో ఆదివారం ఈ లీగ్ ట్రోఫీని, జెర్సీని సినీ, క్రికెట్ ప్రము-ఖులు ఆవిష్కరించారు. దిగ్గజ క్రికెటర్లు కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, సురేశ్ రైనాలతో పాటు సినీ నిర్మాత దిల్ రాజు, నటుడు సోనూ సూద్, సంగీత దర్శకుడు తమన్, నటి రాశీ ఖన్నా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కపిల్ దేవ్, వీరేంద్ర సెహ్వాగ్, దిల్ రాజు, సోనూ సూద్ కలిసి స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఆడారు.టాలీవుడ్.. క్రికెట్ పట్ల ఆసక్తి చూపడం అభినందనీయమన్నారు కపిల్‌దేవ్. హైదరాబాద్ అందమైన నగరమే కాదు, రుచికరమైన వంటకాలకు కేంద్రమని కొనియాడారు. సినీ నటులు, టెక్నీషియన్లు కలిసి క్రికెట్ లీగ్ ఆడటం మంచి పరిణామమన్నారు వీరేంద్ర సెహ్వాగ్. తెర మీద కనిపించే నటులతో పాటు తెర వెనుక ఉండి పని చేసేవారితో కలిసి టీపీఎల్ టోర్నీ జరుగుతుందన్నారు దిల్‌రాజు. ఆరు జట్లతో కూడిన ఈ ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌లో ప్రముఖ నిర్మాతలు జట్లకు యజమానులుగా వ్యవహరిస్తారని తెలిపారు.

# విశాఖలో శ్రీలంకపై భారత్ అద్భుత విజయం






**129 పరుగుల లక్ష్యాన్ని**
**11.5 ఓవర్లలో ఛేదించిన టీమిండియా**
**7 వికెట్ల తేడాతో శ్రీలంకపై భారత్ విజయం**
**5 టీ20ల సిరీస్‌లో 2-0తో భారత్ ఆధిక్యం**

శ్రీలంకతో జరుగుతున్న ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖపట్నంలో జరిగిన రెండవ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. 129 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా 11.5 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తద్వారా 7 వికెట్ల తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 2-0 ఆధిక్యంలో నిలిచింది. షెఫాలీ వర్మ అద్భుతమైన బ్యాటింగ్‌తో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఆమె 34 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్సుతో 69 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. మిగిలిన బ్యాటర్లలో జెమీమా రోడ్రిగ్స్ 26 పరుగులు, స్మృతి మంధాన 14 పరుగులు, హర్మన్ ప్రీత్ కౌర్ 10 పరుగులు చేశారు.

అంతకముందు, టాస్ ఓడిపోయి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. శ్రీలంక బ్యాటర్లలో హర్షిత 33 పరుగులు, చమరి ఆటపట్టు 31 పరుగులు, హాసిని పెరీరా 22 పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీచరణి, వైష్ణవి శర్మ చెరో రెండు వికెట్లు తీయగా, క్రాంతి గౌడ్, స్నేహ్ రాణా చెరో వికెట్ పడగొట్టారు.



## భారత ఆటగాళ్లపై ఐసీసీకి ఫిర్యాదు!

అండర్ 19 ఆసియా కప్ ఫైనల్లో భారత కుర్రాళ్లు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని, వారిపై ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ఛైర్మన్ మోహ్సిన్ నఖ్వీ తెలిపారు. ఐసీసీ రూల్స్ ప్రకారం రాజకీయాలకు క్రికెటర్లు దూరంగా ఉండాలని, కానీ భారత ఆటగాళ్లు తమ పట్ల అనుచితంగా ప్రవర్తించారని నఖ్వీ ఆగ్రహం వ్యక్తం చేశారు.మైదానంలో కూడా తమ ఆటగాళ్లను తరుచూ రెచ్చగొట్టారని తెలిపారు. భారత ఆటగాళ్లపై అధికారికంగా ఐసీసీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆదివారం జరిగిన అండర్ 19 ఆసియాకప్ 2025 ఫైనల్లో పాకిస్థాన్ అండర్ 19 టీమ్ 191 పరుగుల భారీ తేడాతో భారత్‌ను చిత్తు చేసిన సంగతి తెలిసిందే. ఈ విజయం నేపథ్యంలో సోమవారం ఇస్లామాబాద్‌లో ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్‌ను పాకిస్థాన్ అండర్ 19 టీమ్ కలిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మోహ్సిన్ నఖ్వీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. భారత ఆటగాళ్ల తీరును తప్పుబట్టాడు.ఫైనల్ అనంతరం మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా రన్నరప్ మెడల్స్ స్వీకరించేందుకు భారత అండర్ 19 టీమ్ ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో ఐసీసీ అసోసియేట్ డైరెక్టర్ ముబష్మీర్ ఉస్మానీ చేతుల మీదుగా భారత ఆటగాళ్లు మెడల్స్ అందుకున్నారు. ఈ ఘటనపై నఖ్వీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రధానితో సమావేశం అనంతరం నఖ్వీ భారత ఆటగాళ్లపై మండిపడ్డాడు.సీనియర్ ఆటగాళ్ల ఆసియా కప్ సందర్భంగా కూడా నఖ్వీ చేతుల మీదుగా టైటిల్ అందుకునేందుకు భారత ఆటగాళ్లు నిరాకరించారు. దాంతో నఖ్వీ ట్రోఫీని తన వెంట తీసుకెళ్లాడు. ఇప్పటి వరకు భారత్‌కు అందజేయలేదు. ఈ ఘటనపై ఇరు జట్లు ఐసీసీకి ఫిర్యాదు చేశాయి. భారత ఆటగాళ్ల వ్యవహార శైలిని పాకిస్థాన్ అండర్ 19 టీమ్ మెంటార్ సర్ఫరాజ్ అహ్మద్ కూడా తప్పుబట్టాడు. భారత కుర్రాళ్లు క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని మండిపడ్డాడు. 'గతంలో మేం క్రికెట్‌ను గౌరవించే భారత జట్టుతో ఆడాం. కానీ ఈ కుర్రాళ్లు ప్రవర్తించిన తీరు అగౌరవంగా ఉంది. గెలుపు సంబరాలు గౌరవప్రదంగా ఉండాలని నేను మా ఆటగాళ్లకు చెప్పాను.మా కుర్రాళ్లు ఈ ఫార్మాట్‌లో తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని నేను ఆశించాను. మా ఆటగాళ్లకు నేను చెప్పింది ఒక్కటే.. మీ మీద మీరు నమ్మకం ఉంచండి, ప్రత్యర్థులు ఏం చేసినా పట్టించుకోవద్దని చెప్పాను. క్రీడల పట్ల భారత్ తీరు సరిగ్గా లేదు. ఈ టోర్నీలో భారత జట్టు ప్రవర్తించిన తీరు అనైతికం. మేం అయితే క్రీడాస్ఫూర్తితోనే విజయ సంబరాలు జరుపుకున్నాం. భారత్ ఏం చేసింది అనేది వారి స్వయంకృతం.'అని సర్ఫరాజ్ అహ్మద్ అన్నాడు.

## చరిత్ర సృష్టించిన దీప్తి శర్మ..




మంగళవారం విడుదలైన ఐసీసీ మహిళల టీ20ఐ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఆల్ రౌండర్ దీప్తి శర్మ నంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా, బ్యాట్స్‌మెన్ వన్డే ర్యాంకింగ్స్‌లో స్మృతి మంధాన నంబర్ వన్ స్థానాన్ని కోల్పోయింది.దీప్తి శర్మ తొలిసారిగా టీ20ఐ అంతర్జాతీయ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ బౌలర్‌గా నిలిచింది. విశాఖపట్నంలో శ్రీలంకతో జరిగిన టీ20ఐ సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో 4 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి 1 వికెట్ తీసిన దీప్తి, ఆస్ట్రేలియాకు చెందిన అన్నాబెల్ సదర్లాండ్‌ను అధిగమించి టాప్ బౌలర్‌గా నిలిచింది. ఇదిలా ఉండగా, దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్ట్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఐర్లాండ్‌తో జరిగిన స్వదేశీ వన్డే సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌లలో సెంచరీలు చేసిన వోల్వార్ట్‌కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు కూడా లభించింది.ఈ ప్రదర్శనతో, వోల్వార్డ్ తన కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్‌ను సాధించింది. స్మృతి మంధానను అధిగమించి నంబర్ 1 స్థానాన్ని ఆక్రమించింది. నిజానికి, లారా వోల్వార్డ్ ఇంతకు ముందు కూడా ఈ స్థానాన్ని ఆక్రమించింది.అంతేకాకుండా, శ్రీలంకపై అజేయ అర్ధ సెంచరీ సాధించిన జెమిమా రోడ్రిగ్స్, టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు ఎగబాకి టాప్ 10కి చేరుకుంది, తొమ్మిదవ స్థానానికి చేరుకుంది. ఆమెతో పాటు స్మృతి మంధాన మూడవ స్థానంలో, షఫాలి వర్మ పదవ స్థానంలో ఉన్నారు. అదే సమయంలో, బౌలింగ్‌లో, అరుంధతి రెడ్డి కూడా ఐదు స్థానాలు ఎగబాకి 36వ స్థానానికి చేరుకుంది.

## టీ20ల్లో వరల్డ్ రికార్డు సృష్టించిన ఇండోనేషియా బౌలర్




అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో అపూర్వమైన ఘట్టం ఆవిష్కృతమైంది. ఇండోనేషియాకు చెందిన ఫాస్ట్ బౌలర్ గెడె ప్రియాందన ఒకే ఓవర్‌లో ఐదు వికెట్లు పడగొట్టి సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. టీ20 ఫార్మాట్‌లో ఇప్పటివరకు ఎవరికీ సాధ్యం కాని ఈ అద్భుత ఫీట్‌ను సాధించిన తొలి బౌలర్‌గా చరిత్రకెక్కాడు. బాలి వేదికగా కంబోడియాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మంగళవారం ఈ సంచలనం చోటుచేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండోనేషియా, ధర్మ కేసుమా అజేయ శతకం (110) సాయంతో 167 పరుగులు చేసింది. అనంతరం 168 పరుగుల లక్ష్య ఛేదనలో కంబోడియా 15 ఓవర్లు ముగిసేసరికి 5 వికెట్లకు 106 పరుగులతో ఫర్వాలేదనిపించింది. కానీ, 16వ ఓవర్ బౌలింగ్‌కు వచ్చిన ప్రియాందన మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ప్రియాందన తన ఓవర్‌లోని తొలి మూడు బంతులకు 3 వికెట్లు తీసి హ్యాట్రిక్ నమోదు చేశాడు. నాలుగో బంతి డాట్ కాగా, చివరి రెండు బంతులకు మరో రెండు వికెట్లు పడగొట్టాడు. చివరి రెండు బంతుల మధ్య ఒక వైడ్ ఉండడంతో ఈ ఓవర్లో ఒక అదనపు పరుగు మాత్రమే వచ్చింది. దీంతో కంబోడియా 107 పరుగులకే ఆలౌట్ కాగా, ఇండోనేషియా 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇంతకుముందు టీ20ల్లో లసిత్ మలింగ, రషీద్ ఖాన్, జేసన్ హోల్డర్ వంటి దిగ్గజాలు ఒకే ఓవర్‌లో నాలుగు వికెట్లు తీసిన సందర్భాలు ఉన్నప్పటికీ, ఐదు వికెట్లు తీయడం ఇదే తొలిసారి. ప్రియాందన అసాధారణ ప్రదర్శన ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది.





# శివాజీ వ్యాఖ్యల రచ్చ

## దులిపేసిన సింగర్ చిన్మయి... మా బాడీ..మా ఇష్టం అన్న అనసూయ


## శివాజీ తరపునే నేను క్షమాపణలు చెబుతున్నా: మనోజ్



నటుడు శివాజీ వ్యాఖ్యలపై సింగర్ చిన్మయి సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. హీరోయిన్లు చీరలు కట్టుకోవాలని, లేదంటే వారి 'సామాన్లు' కనిపిస్తాయని శివాజీ అనడాన్ని చిన్మయి తప్పుబట్టింది. ముఖ్యంగా 'దరిద్రపు ము?' వంటి బూతు పదాలను ప్రొఫెషనల్ వేదికలపై వాడటం ఏంటని శివాజీని ప్రశ్నించింది. సామాన్లు వంటి పదాలను కేవలం 'ఇన్సెల్స్' (స్త్రీ ద్వేషులు) మాత్రమే వాడుతుంటారని ఆమె విమర్శించింది. అంతేగాకుండా హీరోయిన్లు భారతీయ సంప్రదాయం పాటించాలని చెప్పిన శివాజీ.. తాను మాత్రం జీన్స్, హూడీలు ధరిస్తారు. సంప్రదాయం గురించి అంతగా మాట్లాడేటప్పుడు ఆయన కేవలం ధోతీలు మాత్రమే కట్టుకోవాలి కదా? నుదుట బొట్టు పెట్టుకోవాలి, వివాహం అయినట్లు గుర్తుగా కంకణాలు, మెట్టెలు ధరించాలి కదా? అంటూ చిన్మయి ప్రశ్నించింది. ఒక సినిమాలో విలన్‌గా నటించిన శివాజీ.. బయట ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా స్త్రీలను ద్వేషించే వ్యక్తులకు హీరోగా మారుతున్నారని ఆమె ఎద్దేవా చేసింది. ఒక బహిరంగ వేదికపై మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన ఉండటం నమ్మశక్యంగా లేదని, అసలు మహిళలను ఇక్కడ ఎలా చూస్తున్నారో అర్థమవుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చిన్మయి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీశాయి. నటుడు శివాజీ వ్యాఖ్యలపై ఇప్పటికే సింగర్ చిన్మయి స్పందించగా.. తాజాగా యాంకర్, నటి అనసూయ కూడా శివాజీకి గట్టి కౌంటర్‌ను ఇచ్చింది. అనసూయ ఎక్స్ వేదికగా పోస్ట్ పెడుతూ.. ఇది మా బాడీ.. మీది కాదు. మాకు నచ్చినట్లు మేం ఉంటాం అంటూ శివాజీకి కౌంటర్ ఇచ్చారు. మహిళలకు తమకు నచ్చిన దుస్తులు వేసుకునే స్వేచ్ఛ ఉందని, వారి వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం తప్పని శివాజీ వ్యాఖ్యలను పలువురు తప్పుపట్టారు. ఈ వ్యాఖ్యలను తప్పుబడుతూ ఇప్పటికే సింగర్ చిన్మయి, అనసూయ శివాజీని విమర్శించగా.. తాజాగా మంచు మనోజ్ కూడా శివాజీ పేరు ఎత్తకుండానే ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మహిళలను కించపరిచేలా మాట్లాడటం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మనోజ్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఒక లేఖ విడుదల చేశాడు. మహిళల దుస్తుల విషయంలో నీతులు చెప్పడం, వారిపై నైతిక బాధ్యత లేదు అని ఆరోపించడం అనేది చాలా పాత కాలపు ఆలోచన. ఇలాంటి వ్యాఖ్యలు తనను తీవ్ర నిరాశను కలిగించాయని మనోజ్ పేర్కొన్నారు. సమానత్వం, గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ అనేవి చర్చించలేని అంశాలని మహిళల బట్టలపై తీర్పు ఇచ్చే అధికారం ఎవరికీ లేదని ఆయన తేల్చి చెప్పారు. మహిళలను కించపరిచేలా వస్తువులుగా చూస్తూ మాట్లాడిన ఆ సీనియర్ నటుడి తరపున నేను క్షమాపణలు చెబుతున్నాను. పబ్లిక్ ఫిగర్స్‌గా ఉన్నవారు సమాజంపై తమ మాటల ప్రభావం ఉంటుందని గుర్తించి బాధ్యతగా మాట్లాడాలని ఆయన హితవు పలికారు. హిళలకు ఎప్పుడూ గౌరవం, సమానత్వం దక్కాలి. ఇలాంటి విషయాల్లో మౌనంగా ఉండటం సరైన పద్ధతి కాదు. మనోజ్ కుమార్ తన పోస్ట్‌ను ముగించాడు.



## రష్మికకు మెంటలెక్కిపోయిందా?



రౌడీ హీరో విజయ్‌దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ మూవీ -రౌడీ జనార్ధన-. రవి కిరణ్ కోలా దర్శకుడు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ఈమూవీని నిర్మిస్తున్నారు. కెరీర్‌లో తొలిసారి గోదావరి యాసని ఈ సినిమా కోసం విజయ్ దేవరకొండ ట్రై చేస్తున్నాడు. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ టైటిల్ గ్లింప్స్‌ని రీసెంట్‌గా మేకర్స్ విడుదల చేయడం తెలిసిందే. 80వ దశకం నేపథ్యంలో సాగే రస్టిక్, అండ్ రూత్‌లెస్ మూవీగా తెలుస్తోంది. రీసెంట్‌గా విడుదల చేసిన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండని చూపించిన తీరు, తను గోదావరి యాసలో డైలాగ్స్ చెప్పిన విధానం ఫ్యాన్స్, సినీ లవర్స్‌తో పాటు ఇండస్ట్రీ వర్గాలని కూడా విశేషంగా ఆకట్టుకుంటూ హాట్ టాపిక్‌గా మారింది. విజయ్ పక్కా మాసీవ్ అవతార్‌లో ఇంటెన్స్ ఉన్న క్యారెక్టర్‌లో కనిపిస్తున్న తీరు సినిమాపైఅంచనాల్ని పెంచేస్తోంది. చాలా రోజుల తరువాత మళ్లీ రౌడీ స్ట్రైక్స్ అగైన్ అని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాము ఏదైతే రౌడీ నుంచి ఆశిస్తున్నామో అది మళ్లీ ఇన్నాళ్లకు ఈ సినిమాతో నెరవేరబోతోందని హ్యాపీగా ఫీలవుతున్నారు. ఈ నేపథ్యంలో నేషనల్ క్రష్.. విజయ్ లవ్ ఇంట్రెస్ట్ రష్మిక మందన్న -రౌడీ జనార్ధన- గ్లింప్స్‌పై ఎలా స్పందిస్తుందా అని అంతా ఎదురు చూస్తున్నారు. విజయ్ మాసీవ్ లుక్, డైలాగ్స్‌పై రష్మిక ఎలాంటి పోస్ట్ పెడుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే రష్మిక అంతా ఎదురు చూస్తున్నట్టుగానే %-%రౌడీ జనార్ధన%-% గ్లింప్స్‌పై సోషల్ మీడియా వేదికగా స్పందించింది. విజయ్‌ని, ఇందులోని స్టఫ్‌ని చూసి తనకు మెంటలెక్కిపోయిందట. యూ రౌడీ ఫెల్లో..ఇదొక మెంటల్ స్టఫ్. ఏం విజువల్స్.. ఏం మ్యూజిక్..ఏం వైబ్.. ఏం యాక్టింగ్.. విజయ్‌దేవరకొండ, రవికిరణ్ కోలా మీ ఇద్దరు యమ క్రేజీ.. నేను దీన్ని చాలా ప్రేమిస్తున్నాను.. ఇష్టపడుతున్నాను. కీర్తిసురేష్ క్యూటీ నీకు అల్ ద బెస్ట్- అంటూ రష్మిక స్పందించింది. తను రౌడీ జనార్ధన పిక్‌ని జత చేసి రష్మిక షేర్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఇదిలా ఉంటే త్వరలో రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ జంట కాబోతున్న విషయం తెలిసిందే.



## పింక్ డ్రెస్ లో మెరిసిపోతున్న భాగ్యశ్రీ..

టాలీవుడ్ లో ఇప్పుడు యూత్ క్రష్ ఎవరు అంటే ఠక్కున వినిపించే పేరు భాగ్యశ్రీ బోర్సే. తక్కువ టైమ్ లోనే తనకంటూ ఒక ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ను క్రియేట్ చేసుకుంది ఈ భామ. కేవలం సినిమాలతోనే కాకుండా సోషల్ మీడియాలో కూడా అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన లేటెస్ట్ ఫొటోషూట్స్ తో నెటిజన్లను కట్టిపడేస్తుంటుంది. సాధారణంగా హీరోయిన్లు గ్లామర్ షోతో ఆకట్టుకోవాలని చూస్తుంటారు. కానీ భాగ్యశ్రీ మాత్రం సంప్రదాయ బద్ధంగా కనిపిస్తూనే మోడర్న్ టచ్ ఇవ్వడంలో దిట్ట. లేటెస్ట్ గా ఆమె తన ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసిన కొన్ని ఫొటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో ఆమె అందం చూసి కుర్రకారు ఫిదా అవుతున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోల్లో భాగ్యశ్రీ పింక్ కలర్ డిజైనర్ వేర్ లో మెరిసిపోతోంది. "ఒక అమ్మాయి పింక్ తో ప్రేమలో పడితే, ఆమె గుండె నవ్వుతుంది" అనే క్యాప్షన్ తో ఆమె ఈ ఫొటోలను షేర్ చేసింది. ఆ డ్రెస్ కు తగ్గట్టుగా సింపుల్ జ్యువెలరీ, చెవికి చిన్న కమ్మలు పెట్టుకుని చాలా క్లాసీగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆమె తల నిమురుకుంటూ నవ్వుతున్న స్టిల్ అయితే చాలా క్యూట్ గా ఉంది. మరో ఫొటోలో దుపట్టాతో ఆడుకుంటూ, వెనక్కి తిరిగి చూస్తున్న చూపులు ఎవరినైనా కట్టిపడేసేలా ఉన్నాయి. బ్యాక్ గ్రౌండ్ లో బ్లూ లైటింగ్, ఆమె వేసుకున్న పింక్ డ్రెస్ కాంబినేషన్ ఫొటోలకు కొత్త కళను తీసుకొచ్చింది. గ్లామర్ అంటే కేవలం ఎక్స్ పోజింగ్ కాదని, ఇలా నిండుగా ఉంటూనే కిల్లింగ్ లుక్స్ ఇవ్వొచ్చని ఆమె నిరూపిస్తోంది. ఆ నవ్వులోనే ఏదో మ్యాజిక్ ఉందని ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ముంబై నుంచి వచ్చినా కూడా అచ్చమైన తెలుగు అమ్మాయిలా కనిపించడం భాగ్యశ్రీ స్పెషాలిటీ. ఈ పింక్ డ్రెస్ లో ఆమెను చూస్తుంటే ఏదో బాపు బొమ్మలా అనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఈ పిక్స్ కు లైకుల వర్షం కురుస్తోంది.



## బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారం

### సిఐడి విచారణకు హాజరైన మంచు లక్ష్మి

నిషేధిత బెట్టింగ్ యాప్‌ల ప్రచార వ్యవహారానికి సంబంధించి సినీ నటి మంచు లక్ష్మి మంగళవారం హైదరాబాద్‌లోని సీఐడీ విచారణకు హాజరయ్యారు. లక్డీకపూల్‌లోని సీఐడీ కార్యాలయానికి చేరుకున్న ఆమెను ఈ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు గానూ అందిన పారితోషికం మరియు కమీషన్ల లావాదేవీలపై అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నిస్తున్నారు. గతంలోనే ఇదే కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా ఆమెను విచారించగా, ఇప్పుడు సీఐడీ అధికారులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. కాగా, ఇదే వ్యవహారంలో గతంలో టాలీవుడ్ ప్రముఖ నటులు విజయ్ దేవరకొండ, రానా దగ్గుబాటి, ప్రకాశ్‌రాజ్ వంటి వారు కూడా విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. సెలబ్రిటీల ప్రచారం కారణంగా సామాన్యులు ఈ బెట్టింగ్ యాప్‌ల బారిన పడుతున్నారనే ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు సంస్థలు ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463